సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం ၊ 1 ၊ జూలై ၊ 2023



తూతూమంత్రంగా మరమ్మతు
చిన్నచింతకుంట ఎర్రకాల్వ మరమ్మతు పనులు తూతూమంత్రంగా చేస్తున్నారు.

వివరాలు IIలో ▸



ఓటును అమ్ముకోవద్దు
పాలకుల ప్రలోభాలకు లోనై ఓటును అమ్ముకోవద్దని ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35.6 /21.5
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైతులకు అవగాహన



కందనూలు: బిజినేపల్లి మండలం పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలోని సమావేశ మందిరంలో కంది పంటలో నూతన రకం తాండూరు కంది 3పై కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలోనే ఈ రకం విత్తనాలు పరిశోధన స్థానం నుంచి విడుదలయ్యాయని చెప్పారు. ఈ రకమైన పంట ఎండు తెగులు, గొడ్డు తెగులును తట్టుకుంటుందని, పంట కాలం 170 రోజులు, మధ్యకాలికమని స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ప్రదర్శన కార్యక్రమాలు చేపట్టామని, జిల్లాలోని రైతులకు ఈ ఏడాది నుంచే వీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

ఖైదీలకు మెరుగైన సేవలు అందించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: సబ్‌జైలులో ఖైదీలకు మెరుగైన సేవలు అందించాలి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలకు పాల్పడి నేరస్తులుగా మారవద్దన్నారు. ఖైదీలకు మెరుగైన సేవలు అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాల, జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మధుసూదన్‌రావు, శ్రీరాం ఆర్య, సబ్‌జైలు సూపరింటెండెంట్ నాగరాజు, కోర్టు సిబ్బంది కేశవరెడ్డి, దేవిక, పుష్పలత పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి


కందనూలు: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు పంపాలని డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులని, nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 15లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి సెల్ నం.99899 21105ను సంప్రదించాలని కోరారు.

మెరిట్ జాబితా విడుదల

కందనూలు: జిల్లాలోని మండల రిసోర్సెస్ సెంటర్స్, జిల్లా ప్రాజెక్ట్ ఆఫీస్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి 2019 డిసెంబర్ 23, 24 తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో వచ్చిన మార్కుల ప్రకారం మెరిట్ జాబితాను డీఈఓ కార్యాలయంతోపాటు జిల్లాలోని ప్రతి మండల రిసోర్స్ కేంద్రం దగ్గర నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు డీఈఓ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీల భర్తీకి సంబంధించిన మార్గదర్శకాలు, షెడ్యూల్, మెరిట్ లిస్టును డీఈఓ వెబ్‌సైట్ (https://deonagarkurnool.weeby.com/)లో చూసుకోవాలని చెప్పారు.

ఇన్‌చార్జి పీఓనే దిక్కు!

మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్టులో కరువైన రెగ్యులర్ పోస్టులు



మన్ననూర్‌లోని ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయం

- ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లోనే పోస్టుల భర్తీ
- చెంచుల ఆర్థికాభివృద్ధి పథకాలకు ఆటంకం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్టు రోజురోజుకీ నిరాదరణకు గురవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టులో భాగంగా ఉండి రాష్ట్రం ఏర్పడ్డాక ఐటీడీఏ మన్ననూర్‌గా ఏర్పాటైంది. అయితే ఐటీడీఏగా అవతరించి ఎనిమిదేళ్లవుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారిని నియమించలేదు. నల్లమలలోని చెంచులు, ఆదివాసీల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఐటీడీఏ ప్రాజెక్టు కార్యకలాపాలకు పీఓనే కీలకంగా వ్యవహరిస్తారు. అలాంటిది ఏళ్ల తరబడి పాటు ప్రాజెక్టు అధికారి, ఇతర సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో జిల్లాలోని మన్ననూర్ ఐటీడీఏ ప్రాజెక్టు నామమాత్రంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

■ జిల్లాలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రభుత్వం 2014లో ఏర్పాటు చేసింది. నాటి నుంచి ఇప్పటి వరకు రెగ్యులర్ ప్రాజెక్టు ఆఫీసర్ నియామకాన్ని చేపట్టకుండా ఇన్‌చార్జీలతోనే కాలం వెళ్లదీస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ప్రాజెక్టులో ఏఓ, ఏపీఓ, ఏఈఓ, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు వంటి కీలకమైన పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీస పోస్టుల భర్తీకి నోచుకోవడం లేదు. గతంలో ప్రాజెక్టు ఇన్‌చార్జి పీఓగా పనిచేసిన అధికారి ఏడాది కిందట బదిలీపై వెళ్లిపోయారు. అప్పటి నుంచి జిల్లా కలెక్టర్ ప్రాజెక్టు ఇన్‌చార్జి పీఓగా వ్యవహరిస్తున్నారు. అయితే నిత్యం జిల్లా పరిపాలన అంశాల్లో నిమగ్నమయ్యే కలెక్టర్ ఐటీడీఏ ప్రాజెక్టు రోజువారీ కార్యకలాపాలపై దృష్టి సారించలేకపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అన్నింటికీ ఒక్కడే దిక్కు..

దుర్భలమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న ఆదివాసీల బాగోగులు చూసేందుకు మన్ననూర్ ఐటీడీఏ(పీవీటీజీ) ప్రాజెక్టు ఏర్పాటైంది. చెంచులు, ఆదివాసీలకు అన్ని రంగాలకు సంబంధించిన పథకాలు, అధికారులను అందుబాటులోకి తెచ్చి వారికి సేవలను విస్తృతపర్చడమే ఐటీడీఏ లక్ష్యం. ఇందుకోసం ప్రాజెక్టులో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఇంజినీరింగ్, మెడికల్ తదితర శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండాలి. అయితే ఇప్పటి వరకు ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. ప్రాజెక్టు మొత్తానికి ఒక్కరే సీనియర్ అసిస్టెంట్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఆయనే ఇన్‌చార్జి ఏఓగానూ కొనసాగుతున్నారు.

పేరుకే ఐటీడీఏ ప్రాజెక్టు..



మన్ననూర్ కేంద్రంగా చెంచుల అభివృద్ధి కోసం ఐటీడీఏ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటివరకు రెగ్యులర్ పీఓను నియమించలేదు. ఏళ్లుగా పోస్టులు భర్తీ చేయకుండా ఒక్క సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఆదివాసులకు అవసరమైన సేవలు అందడం లేదు. కలెక్టర్, ప్రభుత్వం స్పందించి ఐటీడీఏ ప్రాజెక్టులో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి.
– నిమ్మల శ్రీను, జిల్లా అధ్యక్షుడు ఆదివాసి ఐక్యవేదిక

ఏళ్ల కిందటే ప్రతిపాదనలు పంపాం

ఐటీడీఏ ప్రాజెక్టు కింద ఆయా పోస్టుల మంజూరుకు ఏళ్ల కిందటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటివరకు పోస్టులు మంజూరుకాలేదు. సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపైనే పనిభారం ఉంది.
– జాఫర్, ఇన్‌చార్జి ఏఓ, ఐటీడీఏ మన్ననూర్



నల్లమల లోతట్టు ప్రాంతంలోని మల్లాపూర్‌పెంటలోని చెంచుల ఆవాసాలు

పడకేసిన చెంచుల ఆర్థికాభివృద్ధి పథకాలు..

ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలో చెంచుల ఆర్థికాభివృద్ధి కోసం ఎకానామిక్ సపోర్ట్ స్కీం కింద పలు పథకాలను అమలుపర్చాల్సి ఉంది. చెంచులకు సుమారు 60శాతం సబ్సిడీతో గేదెలు, గొర్రెలు, కిరాణం, టెంట్‌హౌస్ యూనిట్లను మంజూరు చేసి పనితీరును పర్యవేక్షించాల్సి ఉండగా, జిల్లాలో ఈ పథకం సరిగ్గా అమలు కావడం లేదు. ఇందుకు ఏటా నిధులు సైతం కేటాయించడం లేదని చెంచులు వాపోతున్నారు. చెంచుల్లో చిన్నారులు, మహిళల పోషకాహారం కోసం ఉద్దేశించిన గిరిపోషణ పథకం కింద జిల్లాకు ఏటా రూ.కోటి చొప్పున నిధులు మంజూరు అవుతున్నా, ఇందులో రూ.20 లక్షలకు మించి ఖర్చు చేయడం లేదని తెలుస్తోంది. గిరి వికాసం కింద గిరిజనులు వ్యవసాయం చేసుకునేందుకు బోర్లు వేసి మోటర్లను ఉచితంగా అందించాల్సి ఉండగా జిల్లాలో చాలా మందికి ఈ పథకం చేరడం లేదు. చెంచుల అభివృద్ధి కోసం చేపట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపర్చాల్సిన ఐటీడీఏ ప్రస్తుతం నిర్వహణ పనులకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారితో పాటు మిగతాపోస్టులను భర్తీ చేస్తేనే చెంచులకు ప్రాజెక్టు సేవలు దరిచేరతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హులందరికీ పోడు పట్టాల పంపిణీ

అచ్చంపేట: ఎన్నో ఏళ్లుగా భూమిని నమ్ముకొని పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు అందిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోడు భూములు సాగు చేస్తున్న గిరిజన లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై పోడు రైతులకు అటవీశాఖ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. 75 ఏళ్లుగా అటవీ ప్రాంతంలో పంటలు వేసే సమయంలో సంబంధిత అధికారులతో గొడవలు జరిగేవని, సీఎం కేసీఆర్ చొరవతో ఇకపై అలాంటి సమస్య రాదన్నారు. జిల్లాలో 1,200 మంది పోడు రైతులకు 3 వేల ఎకరాల భూమికి అటవీ హక్కుల చట్టం కింద పత్రాలు అందజేస్తామన్నారు. రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ మరణం బాధ కలిగించిన ఈ రోజు తమ పుట్టిన రోజు సందర్భంగా గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తెలంగాణ స్వరూపమే మార్చారని కొనియాడారు. పోడు పట్టాలు పొందిన రైతులందరికీ రైతుబంధు, రైతు బీమా వర్తిస్తుందన్నారు. సమావేశానికి ముందుగా హఠాన్మరణం చెందిన సాయిచంద్‌కు సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అలాగే అచ్చంపేటలో ఆదివాసీ చెంచు భవన నిర్మాణానికి గువ్వల బాలరాజు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఎఫ్‌డీఓ విశాల్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కమలాకర్ రెడ్డి, ఆర్డీఓ పాండునాయక్ పాల్గొన్నారు.



గిరిజనులకు పోడు పట్టాలు అందజేస్తున్న గువ్వల బాలరాజు, శాంతకుమారి, ఉదయ్‌కుమార్

పునర్జన్మనిస్తూ..!

- ప్రాణదాతలుగా నిలుస్తున్న డాక్టర్లు
- ఆపద కాలంలో చికిత్సతో బాధితులకు ఊరట
- మానవతా దృక్పథంతో సేవలందిస్తున్న పలువురు
- ఆత్మీయ పలకరింపుతో మెరుగైన చికిత్స అందిస్తే జీవితకాలం గుర్తింపు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



పాలమూరు: దేవుడు మనిషికి జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మనిస్తాడు.. అందుకే వైద్యుడిని నారాయణుడితో పోల్చారు. ప్రతి ఒక్కరూ వైద్యుడిలో దేవుడిని చూస్తారని చెబుతుంటారు.. వారి ఆత్మీయ స్పర్శ రోగికి అపర సంజీవని. వైద్య వృత్తిని చేపట్టి పేదల నాడి పట్టి రుగ్మతకు తగిన చికిత్స అందించి కనిపించే దైవంగా మన్ననలు అందుకుంటున్నారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా.. పేదవాళ్లు అయినా చేతులెత్తి నమస్కరించేది కేవలం వైద్యులకు మాత్రమే. ప్రాణపాయ స్థితిలో ఉన్నా.. ప్రమాదంలో గాయపడినా.. ఇతరత్రా ఎలాంటి ఆపద వచ్చినా గుర్తుకు వచ్చేది వైద్యులు.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం .. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త రోగాలు, వింత వ్యాధులు ప్రబలుతున్నాయి. రోజుకు వేలాది మంది రోగులకు వివిధ రకాల చికిత్స అందిస్తున్నారు. కొందరు వైద్యులు మానవత్వంతో అభాగ్యులకు సేవలందిస్తూ ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు. వృతి ధర్మానికి కట్టుబడి మానవతా విలువలతో ఓవైపు వైద్య సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

బస్సులోనే కాన్పు చేశా..

2010లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత 2011లో మొదటి పోస్టింగ్ నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో పనిచేశాను. ఆ తర్వాత జానంపేట పీహెచ్‌సీలో పనిచేస్తున్న సమయంలో ఒకరోజు విధులు పూర్తి చేసుకుని మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో వస్తుంటే ఓ గర్భిణి కొత్తకోట నుంచి రెఫర్ మీద ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంది. ఈ క్రమంలో మార్గమధ్యలో ఆమెకు నొప్పులు రావడంతో బస్సులోనే నేను కాన్పు చేశాను. ఆ తర్వాత తల్లీబిడ్డలను పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించాం. జాతీయ స్థాయిలో ఒకసారి, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు అవార్డులు తీసుకున్నా.
– డాక్టర్ శ్వేతారెడ్డి, జిల్లా మలేరియా అధికారి, మహబూబ్‌నగర్



ప్రతి గ్రామానికి తిరిగా..



కొల్లాపూర్ గిరిజన ఏరియాలో పనిచేసే సమయంలో ప్రయాణానికి ఇబ్బంది అయినా నిత్యం పీహెచ్‌సీకి వెళ్లాను. పది నెలల పాటు ఆ ఏరియాలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించాం. డెంగ్యూ కేసులు అధికంగా వచ్చిన సందర్భంలో ఒక అమ్మాయికి పరిస్థితి ఇబ్బంది ఉంటే మెరుగైన వైద్యం అందించి ఇంటికెళ్లి పర్యవేక్షించాను. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో ఆర్‌ఎంఓగా పనిచేస్తున్నాను. రాబోయే రోజుల్లో గైనిక్ పూర్తి చేసి మంచి గైనకాలజిస్టుగా గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది.
– డాక్టర్ శిరీష, ఆర్‌ఎంఓ, జనరల్ ఆస్పత్రి, మహబూబ్‌నగర్

నా జీవితంలో మరిచిపోలేను..



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరి ధైర్యం కల్పించడం నా జీవితంలో మరిచిపోలేను. కరోనా పాజిటివ్ వచ్చిన వారి దగ్గరకు వెళ్లి భరోసా ఇవ్వడంతోపాటు ధైర్యంగా అవసరమైన మందులు అందించా. మిడ్జిల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన సమయంలో పీహెచ్‌సీని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ ఎంపిక చేయడం కోసం కృషి చేశాను. ప్రస్తుతం గంగాపూర్ పీహెచ్‌సీలో పనిచేస్తూ.. సాధారణ కాన్పులు పెంచేందుకు కృషి చేస్తున్నాను.
– డాక్టర్ శివకాంత్, గంగాపూర్ మెడికల్ ఆఫీసర్

ప్రజలకు సేవ చేయాలనే తపనతో..



నా 18 ఏళ్ల వైద్య జీవితంలో ఎన్నో మరచిపోలేని ఘటనలు ఉన్నాయి. 2007లో గుండె సమస్యతో ఓ వ్యక్తికి అంబులెన్స్‌లో వైద్యం చేసి మాములు స్థితికి తీసుకురావడం ఇప్పటికీ మరిచిపోను. వాళ్లు కూడా నన్ను గుర్తుపెట్టుకున్నారు. అలాగే మలేరియాతో స్పృహ లేకుండా వస్తే సరైన వైద్యం అందించి నాలుగు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చాడు. 2011లో ట్యూబెక్టమీ సర్జన్‌గా బంగారు పతకం వచ్చింది. రోగి ఎంతో బాధతో వస్తాడు. మనం దానిని అర్థం చేసుకుని సరైన పలకరింపుతోపాటు కావాల్సిన వైద్యం అందిస్తే జీవితం కాలం మరిచిపోరు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో వైద్య రంగంలోకి వచ్చాను.
– డాక్టర్ రఫీక్, జిల్లా క్షయనియంత్రణ అధికారి, మహబూబ్‌నగర్

గ్రూప్‌–4 పరీక్షకు సర్వం సిద్ధం

- జిల్లాలోని 10 మండలాల్లో 50 కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 16,637 మంది అభ్యర్థులు
- ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లుగా నిర్వహణ
- అభ్యర్థులు గంట ముందుగానే చేరుకోవాలని సూచన

కందనూలు: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న గ్రూప్‌–4 పరీక్షకు అధికార యంత్రంగా అన్ని ఏర్పాట్లు చేసింది. పేపర్ లీక్ వ్యవహారంతో పలు ప్రవేశ పరీక్షలను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ.. తిరిగి కొత్త నోటిఫికేషన్లతో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించి హాల్‌టికెట్లను గత నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో ఉంచింది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం కేంద్రాల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లాలోని లైజనింగ్, రూట్ ఆఫీసర్లు (తహసీల్దార్లు) పది మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రొఫార్మాను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించారు.

అత్యంత పకడ్బందీగా..

టీఎస్‌పీఎస్సీ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీక్ నేపథ్యంలో ఈసారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తకుండా టెక్నికల్ డిపార్టుమెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. ప్రశ్నపత్రాలను భద్రపర్చడం.. తిరిగి సెంటర్లకు తరలించే క్రమంలో పోలీసు బందోబస్తు నిర్వహణపై ఆ శాఖకు రూట్ మ్యాప్ అందించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయడంతోపాటు 300 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

రెండు పేపర్లుగా..

గ్రూప్‌–4 పరీక్షలో మొదటి పేపర్ జనరల్ స్టడీస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాయాల్సి ఉంటుంది. పేపర్‌– 2 (సెక్రెటేరియల్ ఎబులిటీ/ మ్యాస్ రిలేటెడ్) మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులను నిర్దేశిత సమయానికి గంట ముందు నుంచే సెంటర్‌లోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను లోనికి అనుమతించరు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు, కీ చైన్లు తదితర వస్తువులను తీసుకురావొద్దని. హాల్ టికెట్‌తోపాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి. హాల్ టికెట్లపై ఫొటో లేకుండా, ఇంకా ఏమైనా తప్పులు ఉంటే.. గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించాలి. జిల్లాకేంద్రానికి దగ్గరలో.. ఆర్టీసీ బస్సు సర్వీసులతో పాటు ప్రైవేటు వాహనాల సేవలు అందుబాటులో ఉన్న మండలాలను పరీక్ష నిర్వహణకు ఎంపిక చేశారు.



పెద్దకొత్తపల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

కేంద్రాలు ఎక్కడెక్కడంటే..

గ్రూప్‌–4 పరీక్షకు జిల్లాలో 16,637 మంది అభ్యర్థులు హాజరుకానుండగా 350 మందికిపైగా దివ్యాంగులు ఉన్నారు. వీరికోసం జిల్లాకేంద్రంలో 18 పరీక్ష కేంద్రాలు, బిజినేపల్లిలో 3, బల్మూరులో 2, అచ్చంపేటలో 8, కల్వకుర్తిలో 11, వెల్దండలో ఒకటి, తెలకపల్లిలో 4, తిమ్మాజిపేటలో 2, పెద్దకొత్తపల్లిలో ఒకటి చొప్పున మొత్తం 50 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్ చొప్పున మొత్తం 50 మందిని నియమించగా.. 750 మందికి పైగా ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు పనిచేయనున్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

నాగర్‌కర్నూల్: గ్రూప్‌–4 పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గ్రూప్‌–4 పరీక్షలపై జూమ్ మీటింగ్ నిర్వహించగా కలెక్టర్ అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 16,632 మంది గ్రూప్‌–4 పరీక్ష రాయనుండగా.. వీరికోసం 50 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించి అనుభవజ్ఞులైన అధికారులను నియమించామని చెప్పారు. అలాగే హెల్ప్ లైన్ నం .08546- 230201కు అందుబాటులో ఉంచామని వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక రూట్లలో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

యువత మార్గదర్శకులుగా మారాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంపీ రాములు, ఆచారి తదితరులు

కల్వకుర్తి టౌన్: యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహిస్తే గొప్పవారు అవుతారని ఎంపీ రాములు అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. జ్యోతి ప్రజ్వలన నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నా చిన్నతనంలో చదువు మానేసి పశువుల కాపరిగా మారానని, నన్ను గుర్తించిన గ్రామ సర్పంచ్ తన తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో చదివించడం వల్లే ఇప్పుడు ఈ స్థాయిలో నిలబడగలిగానన్నారు. ప్రతిభ ఉన్న వారిని గుర్తించక చాలామంది చెడుదారిలో వెళ్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పాఠశాలలో, కళాశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి, అందుకు తగినట్టుగా విద్యాబోధన చేయాలని సూచించారు. దేశంలో ఎంతో మంది జాతీయోద్యమ నాయకుల జీవిత చరిత్రలు అందుకు నిదర్శనం అన్నారు. అనంతరం ఆచారి మాట్లాడుతూ యువత స్వామివివేకానంద లాంటి గొప్పవారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బలవకుండా మంచి మార్గంలో నడిచి దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువ ఉత్సవ్‌లో పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయగౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, యువజన సర్వీసుల శాఖ అధికారి కోటి నాయక్, రమేష్, కళాశాల ప్రిన్సిపల్ సురేందర్‌రెడ్డి, అధ్యాపకుడు వేణయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తకోట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై అమడబాకుల శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రాజస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం కొన్నేళ్లుగా కొత్తకోటలో కార్పెంటర్‌గా పనిచేసుకొని జీవనం సాగిస్తోంది. వారిలో బామేరామ్(32) అనే వ్యక్తి సొంత పనిపై అయిజకు వెళ్లి వస్తుండగా.. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


సాయిలుగౌడ్ (ఫైల్)

వెల్దండ: మూలమలుపులో బైక్ అదుపు తప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని అజిలాపూర్‌కు చెందిన కేశమోని సాయిలుగౌడు(49), జంగయ్యగౌడ్ ద్విచక్రవాహనంపై సొంత పని నిమిత్తం రంగారెడ్డి జిల్లా ఇర్విన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇర్విన్ సమీపంలోని మూలపలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిలుగౌడ్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన జంగయ్యగౌడ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సాయిలుగౌడ్‌కు భార్య లక్ష్మమ్మతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు..

కృష్ణా: మండలంలోని గుడేబల్లూర్ పంచాయతీ టైరోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి 8 గంటలకు గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తికి 40- 45 ఏళ్లు ఉండవచ్చు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి పంచనామా చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఖిల్లాపై రామగుండంలో పడి యువకుడు మృతి



రమేష్(ఫైల్)

పాన్‌గల్: పాన్‌గల్ ఖిల్లాపై ఉన్న రామగుండంలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాన్‌గల్‌కు చెందిన జానమ్మ, కుర్మయ్యలకు చెందిన మూడో కుమారుడు ప్యాట రమేష్(20) గురువారం తొలి ఏకాదశి సందర్భంగా మిత్రులతో కలిసి ఖిల్లాపైకి వెళ్లాడు. అందరూ కలిసి గుండంలో ఈత కొట్టారు. అనంతరం అందరూ అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోగా.. రమేష్ తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుటుంబసభ్యులు ఖిల్లాపై ఉన్న రామగుండం వద్దకు వెళ్లగా నీటిలో తేలుతూ నిర్జీవంగా కనిపించాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి సోదరుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వనపర్తి: చికిత్స పొందుతూ వనపర్తికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లారీడ్రైవర్‌గా పని చేసే వనపర్తి పట్టణం పాతకోతకు చెందిన జి.ఎల్లయ్య (39) సొంత పని కోసం గురువారం మధ్యాహ్నం గోపాల్‌పేటకు వెళ్లి తిరుగు పయానం అయ్యాడు. ఈ నేపథ్యంలో వనపర్తి శివారు ప్రాంతంలోని ఎస్‌టీ థామస్ పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్ అతివేగంతో వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఎల్లయ్యకు వనపర్తి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోకారి వివరాల ప్రకారం కొన్ని రోజులుగా ఓ గుర్తు తెలియని మహిళ (40) ఎర్రవల్లి పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ నివసిస్తోంది. షేకుపల్లి రోడ్డులోని ఓ దుకాణం ఎదుట గురువారం రాత్రి నిద్రించి ఉదయం వరకు మృతి చెంది అచేతన స్థితిలో పడి ఉంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలి ఆచూకి తెలిస్తే సెల్: 8712670282 కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

తూతూమంత్రంగా మరమ్మతు

- ఎర్ర కాల్వ పనుల్లో అంతులేని అలసత్వం
- రెండోసారి నిధులు మంజూరు చేసినా అదే దుస్థితి
- అటువైపు కన్నెత్తిచూడని అధికారులు
- రూ.లక్షల్లో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం


ఎర్ర కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా కృషిచేస్తుంది. ఇందులో భాగంగా చెరువులు, కుంటలు, కాల్వల మరమ్మతు కోసం రూ.కోట్లు వెచ్చిస్తుండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఆ ఆశయాలకు గండి కొట్టేలా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డేమాన్, అల్లీపూర్ గ్రామాల గొలుసుకట్టు చెరువు ఎర్రకాల్వ మరమ్మతుకు రూ.13 లక్షలు మంజూరు చేయించారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను నామమాత్రంగా చేపడుతున్నారు. కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలిగించి ఇరువైపులా కాంక్రీట్ చేయాల్సి ఉంది. కానీ, కాల్వకు ఏర్పడిన గండ్లకు మాత్రమే మట్టిని పోసి అరకొరగా పనులను చేపడుతున్నారు. దీంతో కాల్వలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అలాగే ఉండటంతో వర్షాకాలంలో వరదలకు మళ్లీ కాల్వకు గండ్లు ఏర్పడుతాయని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే 2016 సంవత్సరంలో ఇదే కాల్వ మరమ్మతుకు మిషన్ కాకతీయలో భాగంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రూ.45 లక్షలు మంజూరు చేయించగా మరమ్మతు చేపట్టారు. ఇప్పుడు మళ్లీ మరమ్మతు కోసం రూ.13 లక్షలు వెచ్చించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తీరని ఇబ్బందులు..

చిన్నవడ్డెమాన్ గ్రామ సమీపంలోని చిన్నవాగు కర్తల నుంచి ఏదులాపూర్, చిన్నచింతకుంట, మద్దూరు, అల్లీపూర్ గ్రామాల చెరువులను నీటితో నింపి రైతులకు సాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వాలు ఎర్రకాల్వను నిర్మించాయి. వర్షపు నీరు వాగు ద్వారా నేరుగా చెరువులకు చేరేది. దీంతో రైతులు రెండు పంటలను పుష్కలంగా పండించుకునేవారు. గత కొన్నేళ్లుగా కాల్వ మరమ్మతుపై దృష్టి సారించకపోవడంతో కాల్వలో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఫలితంగా కాల్వ పొడవునా పలుచోట్ల గండ్లు ఏర్పడి చెరువులకు నీరు చేరకుండా వృథాగా పంట పొలాలను ముంచెత్తుతోంది. దీంతో వందల ఎకరాలు నీట మునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. అంతేకాక చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరక ఆయకట్టు కింది రైతులు సాగుచేసిన పంటలకు నీరు అందక పంట ఎండిపోయి రైతులకు నష్టాలు వాటిల్లి పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



వడ్డెమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట గొలుసుకట్టు చెరువుల ఎర్రకాల్వలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగి పలు చోట్ల గండ్లు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం ఆయా చెరువులకు నీరు చేరకుండా మా పంట పొలాలను ముంచి నష్టం వాటిల్లుతుంది. అధికారులు కాల్వ మరమ్మతు నామమాత్రంగా చేపడుతూ చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా కాల్వకు కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలి.

– చిరంజీవిగౌడ్, రైతు, ఏదులాపూర్

నిధులు దుర్వినియోగం..



పెద్దవడ్డెమాన్ నుంచి అల్లీపూర్ గ్రామ చెరువు వరకు ఉన్న గొలుసుకట్టు ఎర్ర కాల్వ మరమ్మతు చేపట్టేందుకు ప్రభుత్వం 2016లో నిధులు మంజూరు చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులను నామమాత్రంగా చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారు. దీంతో కాల్వకు పలుచోట్ల యథావిధిగా గండ్లు ఏర్పడ్డాయి. మళ్లీ రెండోసారి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు, కాంట్రాక్టర్ల పనితీరు మారడం లేదు.

– శేఖర్, రైతు, చిన్నచింతకుంట

నిధులు మంజూరయ్యాయి..



చిన్నచింతకుంట ఎర్ర కాల్వలో ముళ్లపొదలను తొలగించి విస్తరించడంతోపాటు ఇరువైపులా కాంక్రీట్ నిర్మించేలా సర్వే చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. కానీ, కాల్వకు ఏర్పడిన గండ్లు పూడ్చేందుకు మాత్రమే రూ.13 లక్షల నిధులు మంజూరయ్యాయి. జీఎస్టీ పోను మిగిలిన రూ.8 లక్షల నిధులతో గండ్లు ఏర్పడిన చోట మట్టి పోసి పూడ్చుతున్నాం.

– గోపాలచారి, ఇరిగేషన్ డీఈఈ

డీఈఓ కార్యాలయంలో.. టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్లు

కందనూలు: టెక్నికల్ కోర్స్ సర్టిఫికెట్స్ (టీసీసీ) ఫిబ్రవరి–2023 సంవత్సరంలో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన టైపింగ్ లోయర్, హైయర్, డ్రాయింగ్ లోయర్, హైయర్ విద్యార్థుల ఒరిజినల్ మెమోలు జిల్లాకేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ హాల్‌టికెట్స్ జిరాక్స్ ప్రతి చూపించి ఒరిజినల్ మెమోలను తీసుకెళ్లాలని కోరారు.

నిందితుడికి రిమాండ్

మక్తల్: చోరీ కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 27న పట్టణంలోని నల్లజానమ్మ ఆలయంలో రెండు తులాల నాను, ఉమా మహేశ్వర ఆలయంలో 10 మాసాల బంగారం చోరీ చేసిన ఘటనలో కోమలి పోచయ్యను పోలీసులు ఈనెల 28న అరెస్టు చేశారు. ఇతడే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ జిల్లాలోని దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని ఉంధ్యాలలో అనుమతి లేకుండా నిల్వ చేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆర్‌ఐ తిరుపతయ్య శుక్రవారం పట్టుకున్నారు. ఉన్నాధికారుల ఆదేశాల మేరకు స్థానిక డీలర్ నర్సింహులుకు బియ్యాన్ని అప్పజెప్పినట్లు ఆర్‌ఐ పేర్కొన్నారు.

వ్యవసాయ పొలాల్లో ఇసుక నిల్వలు


మద్దూర్ వ్యవసాయ పొలాల్లో ఇసుక నిల్వలు

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్, అల్లిపురంలో ఇసుక అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా సమీపంలోని ఊకచెట్టు వాగు నుంచి ఇసుకను తరలించి తమ వ్యవసాయ పొలాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాలకు ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మద్దూర్ నుంచి ఉంద్యాలకు వెళ్లే దారిలో అక్రమార్కులు తమ వ్యవసాయ పొలాల్లో పలు చోట్ల నిల్వ చేసి ఉంచారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విషయం తెలిసిన చూసిచూడనట్టు వ్యవరిస్తున్నారని శుక్రవారం గ్రామస్తులు పలువురు ఆరోపించారు. విషయంపై తహసీల్దార్ సువర్ణరాజును వివరణ కోరగా అక్రమ ఇసుక తరలింపు, డంపుల విషయం మా దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి


క్రీడాకారులను సన్మానిస్తున్న ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక రుగ్మతులను దూరం చేసుకోవచ్చని ఎస్పీ మనోహర్ అన్నారు. అంతర్జాతీయ ఖోఖో దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో మానసికోల్లాసం పొందడంతోపాటు మంచి క్రమశిక్షణ కలిగి ఉండడం వలన సమాజంలో మంచి పేరు సంపాదించుకోవచ్చన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఇన్‌చార్జ్ నిరంజన్ యాదవ్, ప్రకాష్, పూర్ణచంద్, మోహన్‌లాల్, కుర్మయ్య, రవికుమార్, రాఘవులుగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోనై ఓటును అమ్ముకోవద్దు


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

శాంతినగర్: వచ్చే ఎన్నికల్లో పాలకుల కోసం ప్రలోభాలకు లోనై ఓటును అమ్ముకోవద్దని బహుజన్ సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయాన్ని పెట్టుబడిగా మలుచుకుని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దోపిడీ పాలన కొనసాగుతోందన్నారు. ఆర్డీఎస్ కెనాల్ పూర్తి చేయడంలో అధికార పార్టీ వైఫల్యం చెందిందన్నారు. ఆర్డీఎస్ కెనాల్‌కు రావాల్సిన నిధులు ఎవరి జేబుల్లోకి పోయాయి, ఎవరి బంగ్లాలో ఉన్నాయని ప్రశ్నించారు. తుంగభద్ర వరదల్లో మునిగిన గ్రామాల నిర్వాసితులకు ఇప్పటివరకు ఇళ్లను కట్టించి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం కల్పించలేకపోయారన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎందుకు చేర్చడం లేదని ప్రశ్నించారు. ఆయా పార్టీల్లో పని చేస్తున్న నాయకులు బానిసత్వ రాజకీయాలు చేస్తున్నారని వాపోయారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. రాష్ట్రంలో బీఎస్పీ ఎదుగుదలను చూసి అధికార పార్టీ గుండెల్లో భయం, వెన్నులో వణుకు పడుతోందన్నారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బీఎస్పీ నాయకులు సిద్ధార్థపూలే, పసుపుల బాలస్వామి, కందికంటి విజయ్‌కుమార్, తిరుపాల్, మధుగౌడ్, కనకం బాబు, నాగజ్యోతి పాల్గొన్నారు.

శ్రీశైలం రహదారిలో రెండు కార్లు ఢీ: ఏడుగురికి గాయాలు


శ్రీశైలం రహదారిలో ఢీకొన్న కార్లు

దోమలపెంట: అమ్రాబాద్ మండలం నల్లమలలోని శ్రీశైలం ప్రధాన రహదారిలో దోమలపెంట అటవీ చెక్‌పోస్టుకు పది కిలోమీటర్ల దూరంలో రెండు కార్లు ఢీకొనడంతో ఏడుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ బిల్లాస్‌పూర్‌కు చెందిన ముఖేష్ అగర్వాల్, అర్నవ్ అగర్వాల్ శ్రీశైలంలో స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకుని ఓ ట్రావెల్స్‌కు సంబంధించిన కారులో హైదరాబాద్‌కు బయల్దేరారు. హైదరాబాద్ హబ్సిగూడకు చెందిన బి.విషాల్, మౌనిక, వరుణ్‌రాజ్, కె.బన్నీ శ్రీశైలం వైపు పయనమయ్యారు. వీరి రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో అందులో ఉన్న ఆరుగురు ప్రయాణికులతో పాటు వెళుతుండగా.. ఎదురుగా వచ్చిన కారును ట్రావెల్స్ డ్రైవర్ మహమ్మద్ గాయపడ్డారు. వీరిని ఈగలపెంటలోని జెన్‌కో ఆస్పత్రికి తరలించి.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలు కోసం హైదరాబాద్‌కు పంపించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరమల్లు పేర్కొన్నారు.

వ్యక్తికి రెండేళ్ల కారాగార శిక్ష

అచ్చంపేట రూరల్: దాడికి పాల్పడిన ఘటనలో ఓ వ్యక్తికి రెండేళ్ల కారాగార శిక్ష పడింది. 2017లో జడ్పర్లకు చెందిన రమేష్ అచ్చంపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం అచ్చంపేట సివిల్ కోర్టులో హాజరుపర్చగా పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి విజయ్‌కుమార్ దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్, కోర్టు కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఆరుగురికి శిక్ష

కోస్గి: ఆస్తి తగాదాలో జరిగిన గొడవకు సంబంధించి నమోదైన కేసులో దాడికి పాల్పడిన ఆరుగురు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం కోస్గి కోర్టు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పర్వీన్ బేగం తీర్పునిచ్చారు. కేసు వివరాలను పరిశీలిస్తే మండల పరిధిలోని సర్జఖాన్‌పేటకి చెందిన రేణుక కుటుంబంపై ఇరుగు పొరుగు వారు స్థల విషయమై గొడవపడి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఆరుగురు వ్యక్తులపై కోస్గి పోలీసులు 2016 మే 28న కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆరుగురు నిందితులకు 15 రోజుల సాధారణ జైలు శిక్ష లేదా ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.12,000 జరిమాన విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన డీసీఎం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు


కొత్తకోట బైపాస్‌లో లారీని ఢీ కొట్టిన డీసీఎం

కొత్తకోట: కర్నూలు నుంచి హైదరాబాద్ వెళుతున్న డీసీఎం రోడ్డు పక్కన నిలిచిన లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి తర్వాత 1:30 గంటల ప్రాంతంలో కొత్తకోట బైపాస్ వద్ద చోటుచేసుకుంది. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఓ లారీ టైర్ పంక్చర్ కావడంతో లారీని పక్కన నిలిపి ఉంచాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన ఓ డీసీఎం లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న నికోలస్ (44) అక్కడికక్కడే మృతి చెందగా.. డీసీఎం డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిది స్వస్థలం తమిళనాడుగా తెలిసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

✻ మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

• • •

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

• • •

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కునేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

– నిర్మలారెడ్డి


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టెస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆవుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హాయిగా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదదాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గానూ పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.



"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.


ఆష్క గొరాదియ